# 20

# అద్భుతముల మూడవ సముదాయం

## (9:18-38)

తరువాత గల విషయము ఈ పరంపరలో మూడవది మరియు చిట్టచివరిదైన అద్భుతముల సముదాయమై యున్నది (9:18-34). ఇదివరకటి రెండు సముదాయములలో వలెనే, ఈ వర్గీకరణములో మూడు విలక్షణమైన కథలున్నవి. డగ్లస్ ఆర్. ఏ. హేర్ గమనించిన వివరము ఇలా ఉన్నది,

> ఈ మూడు కథలు కూడ "ద్వంద్వ అద్భుతములై" యున్నవి. చనిపోయి చిన్నదానిని లేపుట గూర్చిన మొదటి కథ రక్తస్రావ రోగముగల స్త్రీని స్వస్థపరచుటను కలుపుకొనుచున్నది [9:18-26], రెండవది ఇద్దరు గ్రుడ్డివారికి వారి కనుదృష్టిని పునరుద్ధరించుట గూర్చి నివేదించుచున్నది [9:27-31], మరియు మూడవది రెట్టింపు రుగ్మతలతో, దయ్యము పట్టి [మూగవాడుగా] బాధపడుచుండిన ఒక రోగి గూర్చి తెలియజెప్పుచున్నది [9:32-34].[1]

ఈ కథలలో విశ్వాసము ఒక సామాన్య అంశమై యున్నది: సమాజమందిరపు అధికారి మరియు రక్తస్రావ రోగముతో బాధపడుచుండిన స్త్రీ ప్రదర్శించిన విశ్వాసము (9:18, 20-22), ఇద్దరు గ్రుడ్డివారు కలిగియుండిన విశ్వాసము (9:27-29), మరియు దయ్యముపట్టినవాడు స్వస్థతనొందుటను చూచి జనసమూహము కనుపరచిన విశ్వాసము (9:32, 33).[2]

### రక్తస్రావ రోగముగల స్త్రీ స్వస్థపరచబడుట మరియు యాయీరు కుమార్తెను లేపుట (9:18-26)

**18ఆయన ఈ మాటలు వారితో చెప్పుచుండగా, ఇదిగో ఒక అధికారి వచ్చి ఆయనకు మ్రొక్కి -నా కుమార్తె యిప్పుడే చనిపోయినది, అయినను నీవు వచ్చి నీ చెయ్యి ఆమెమీద ఉంచుము, ఆమె బ్రదుకుననెను. 19యేసు లేచి అతని వెంట వెళ్లెను; ఆయన శిష్యులు కూడ వెళ్లిరి. 20ఆ సమయమున, ఇదిగో పండ్రెండు సంవత్సరములనుండి రక్తస్రావ రోగముగల యొక స్త్రీ 21-నేను ఆయన పై వస్త్రము మాత్రము ముట్టితే బాగుపడుదునని తనలో తాను అనుకొని, ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రపు చెంగు ముట్టెను. 22యేసు వెనుకకు తిరిగి ఆమెను చూచి-కుమారీ, ధైర్యముగా ఉండుము, నీ విశ్వాసము నిన్ను బాగుపరచెనని చెప్పగా ఆ గడియనుండి ఆ స్త్రీ బాగుపడెను. 23అంతలో యేసు ఆ అధికారి యింటికి వచ్చి, పిల్లన గ్రోవులు వాయించు వారిని, గొల్లు చేయుచుండు జనసమూహమును చూచి 24-స్థలమియ్యుడి ఈ చిన్నది నిద్రించుచున్నదేగాని చనిపోలేదని వారితో చెప్పగా వారాయనను అపహసించిరి. 25జనసమూహమును పంపివేసి, ఆయన లోపలికి వెళ్లి ఆమె చెయ్యిపట్టుకొనగానే ఆ చిన్నది లేచెను. 26ఈ సమాచారము ఆ దేశమంతటను వ్యాపించెను.**

ఈ సంక్లిష్టమైన కథ యేసు ప్రభువు స్త్రీలు మరియు పిల్లల యెడల కలిగియున్న కనికరమును ప్రదర్శించుచున్నది, వీరు మొదటి శతాబ్దము నాటి యూదా మత సమాజములో కించపరచబడుచుండిరి. ఇతర సమదృక్పథ సువార్తలలో గల వివరముతో పోల్చబడినట్లయితే మత్తయి మనకు తెలియజెప్పుచున్న ఈ కథ సంక్షిప్తముగా నున్నది. మార్కు వ్రాసిన సువార్తలో ఈ కథ నిమిత్తము ఇరవై మూడు వచనములు కేటాయింపబడినవి (మార్కు 5:21-43); లూకా వ్రాసిన సువార్తలో అది పదిహేడు వచనములలో చెప్పబడి యున్నది (లూకా 8:40-56), కానీ మత్తయి వ్రాసిన సువార్తలో అది కేవలము తొమ్మిది వచనములతో సరిపెట్టబడి యున్నది.

**వచనము 18.** యేసు బాప్తిస్మమిచ్చు యోహాను శిష్యులతో ఉపవాసము చేయుట గూర్చి మాటలాడుచుండగా, **సమాజమందిరపు అధికారి ఒకడు ఆయన యొద్దకు వచ్చి ఆయన యెదుట సాగిలపడెను.** "సమాజమందిరము" అను పదమును NASB భాషాంతరీకరణము చేత చేర్చబడినది, ఇది బహుశా మార్కు మరియు లూకా వ్రాసిన సువార్తలలో గల సమానాంతర ఇతిహాసముల ఆధారంగా చేర్చబడి యుండవచ్చును. ఈ "అధికారి" (*archōn*) నామధేయమును మత్తయి మనకు తెలియజెప్పుటలేదు, కానీ ఈ అధికారి పేరు యాయీరు అనియు, అతడు "సమాజమందిరపు అధికారి" అనియు లూకా తన చదువరులకు తెలియజెప్పుచున్నాడు (లూకా 8:41; NIV). యాయీరు "సమాజమందిరపు అధికారులలో ఒకడు" అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 5:22; NIV). కొన్ని సమాజమందిరములకు ఒకరి కంటే ఎక్కువ మంది పెద్దలు గలవి, పెద్దదై యుండిన పెద్దల గుంపులో నుండి ఎన్నుకొనబడిన అధికారులు బహుళ సంఖ్యలో ఉండిరి.

కపెర్నహూములోని సమాజమందిరపు అత్యున్నత్యమైన అధికారుల శ్రేణిలో యాయీరు ఒకడై యుండును. ఈ అధికారులు సమాజమందిరములో జరుగుచుండిన సమస్త కార్యకలాపములకు బాధ్యులై యుండిరి (4:23; 8:5పై గల వ్యాఖ్యానము చూడు). ఈయన, కపెర్నహూములో పేరుగాంచినవాడై అత్యంత మర్యాద ఇవ్వబడినవాడు, యేసు యెదుట వినయముతో "సాగిలపడెను." "సాగిలపడెను" అను అర్థమిచ్చు గ్రీకు పదమునకు (*proskuneō*) "ఆరాధించు" లేక "శ్రద్ధాభక్తులను చూపించు" అని కూడ అర్థము కలదు (2:2పై గల వ్యాఖ్యానము చూడు). ఈ సందర్భములో, రెండవ అర్థము సరైనదై యున్నది.

నిరాశవలన కలిగిన తెగింపుతో, యాయీరు, **నా కుమార్తె యిప్పుడే చనిపోయినది అయినను నీవు వచ్చి నీ చెయ్యి ఆమె మీద ఉంచుము, ఆమె బ్రదుకునని** యేసుతో అన్నాడు. యేసు కపెర్నహూములో అద్భుతములు చేసాడు, స్వస్థపరచువాడను పేరు ప్రతిష్టలను వ్యవస్థాపించాడు. ఇంతకు పూర్వము, పక్షవాతముతో బాధపడుచుండిన రోమా శతాధిపతి దాసునికి ఆయన సహాయము చేయవలెనని కపెర్నహూములోని పెద్దలు యేసును బ్రతిమలాడారు (8:5పై గల వ్యాఖ్యానము చూడు). ఏదిఏమైనా, ఆనాటి నుంచి, శాస్త్రులు మరియు పరిసయ్యులు యేసు పరిచర్యను వ్యతిరేకించుటకు మొదలుపెట్టారు (9:3, 11). యాయీరు, మతసంబంధమైన శిష్టజనము నుండి తలెత్తుటకు అవకాశములుండిన విరోధము గూర్చి పూర్తిగా ఎరిగినవాడై, అతడు యేసు సహాయ సహకారములను అత్యవసర పరిస్థితిలో అవసరమైయున్న సహాయముగా వెదికాడు.[3]

యేసు అతని ఇంటికి వెళ్లి, అతని కుమార్తెను పునరుజ్జీవింపజేయవలెనని ఆయనను

అడుగవలెనను ఆతురతతో ఈ అధికారి యేసు యొద్దకు వచ్చాడు. ఇతడు ఎంతగా ఆందోళనచెందుచుండెనో, యేసు అతని ఇంటికి వెళ్లవలెనని అయనను బ్రతిమిలాడిన తీరు ద్వారా తెలియనగును (లూకా 8:41). "నా చిన్న కుమార్తె" అంటూ ఆమె గూర్చి ఈ అధికారి ఎంతో సుకుమారముగా సూచించాడు (మార్కు 5:23). లూకా 8:42 ప్రకారము, యాయీరు కుమార్తె "పండ్రెండేళ్ల యీడుగలదై," "చావ సిద్ధముగా ఉండెను." ఏదిఏమైనా, ఆమె అదివరకే చనిపోయినదని మత్తయి చెప్పుచున్నాడు. ఈ తేడాను మనము ఎలా సమన్వయపరచవచ్చును? (1) ఈ తేడా కేవలము "మత్తయి ఈ నిర్దిష్ట విభాగమును విపులముగా కుదిరించినదాని ఫలితమై యుండును."[4] (2) హెచ్. లియో బోల్స్ సూచించుచున్నట్లు, "తండ్రి చావ సిద్ధముగా నుండిన ఆమెను వదిలిపెట్టి వెళ్లియుండును, మరియు ఆయన యేసు నొద్దకు చేరుకొనినప్పటికి ఆమె మరణించియుండునని అతడనుకొనుట, సాధ్యమే."[5] (3) విల్యమ్ హెండ్రిక్సెన్ చేత ఈ క్రింది విధముగా సమర్థింపబడుచున్న విషయము మూడవ సాధ్యతయై యున్నది:

> మార్కు మరియు లూకా చెప్పుచున్న దానిని బట్టి, యేసు తన కుమార్తెను స్వస్థపరచవలెనని యాయీరు మొదట అడిగాడు అటుతరువాత, ఆమె చనిపోయినది అతనికి వర్తమానము తెలియజెప్పబడినప్పుడు, అతడు నిరాశ చెందకూడదు కానీ విశ్వసించవలెనని యేసు అతనికి విజ్ఞప్తి చేసాడు. గనుక యాయీరు ఇప్పుడు తన మనవిని మార్పు చేసికొని మరొక విధంగా మనవి చేసాడు, అనగా, యేసు అతని ఇంటికి వెళ్లి చనిపోయిన తన కుమార్తెపై చేతులుంచవలెనని మనవి చేయుచు, "అప్పుడు ఆమె బ్రతుకును" అంటున్నాడు.[6]

స్వస్థపరచుటకును, అవసరమైతే చనిపోయిన వారిని తిరిగి లేపుటకును యేసు సమర్థవంతమైనవాడై యున్నాడని యాయీరు ఆయనయందలి గొప్ప విశ్వాసమును ప్రదర్శించాడు. ఇది గొప్పగా చెప్పుకోదగిన విషయమై యున్నది ఏలయనగా, మనకు తెలిసినంత వరకు, యేసు - తన పరిచర్యలోని ఈ సమయమున - చనిపోయినవారిని ఎవరిని లేపలేదు.

**వచనము 19**. యాయీరు చేసిన మనవికి **యేసు** వెంటనే ప్రతిస్పందించాడు, **ఆయన లేచి** ఆతనితో కూడ అతని ఇంటికి వెళ్లాడు. ఆయన శిష్యులు కూడ వెళ్లారు.

**వచనములు 20, 21.** వారందరు యాయీరు ఇంటికి వెళ్లుచుండగా, యేసు వెంబడించుచుండిన జనసమూహములు "ఆయన మీద పడుచుండిరి" (మార్కు 5:24). ఈ జనసమూహములో, యేసు యొక్క స్వస్థపరచు తాకిడి కొరకు తెగింపుతో తహతహలాడుచుండిన ఒక స్త్రీ ఉండినది. **ఆమె పండ్రెండు సంవత్సరముల నుండి రక్తస్రావ రోగముతో బాధపడుచుండెను.** "రక్త స్రావ రోగముతో బాధపడుట" యను అర్థమిచ్చు గ్రీకు పదము (*haimorroeō*), లేవీయకాండము 15:33లో (LXX) కూడ అగుపించుచున్న పదము, బహుశా స్త్రీ యొక్క నెలవారీ ఋతుస్రావ సమస్యలను సూచించుచుండవచ్చును. "ఈ రుగ్మతలో స్త్రీ రుతుక్రమ స్రావము అసాధారణముగా పొడిగింపబడిన కాలము వరకు కొనసాగవచ్చును, సరికదా సాధారణంగా అది రక్తహీనతను కలుగజేయును"[7] అని జె. విల్లకింన్ వ్రాసాడు.

ఆ స్త్రీ యొక్క బాధాకరమైన పరిస్థితి ఆమెను శారీరకంగాను, ఆర్థికంగాను, సామాజికంగాను, మరియు మతపరంగాను ప్రభావితము చేసినది. ఆమే "అనేక వైద్యుల

చేత ఎన్నో తిప్పలుపడినను" (మార్కు 5:26), "యెవనిచేతనైనను స్వస్థత నొందనిదై" (లూకా 8:43) మరింత సంకట పడెను. ఈ వైద్యులందరు వారి వృత్తిని అభ్యసించుచు రోగులను యింకా ఎక్కువ బాధితులనుగా చేయుచుండిన వైద్యులై యుండవచ్చును. అయితే ఆ స్త్రీ ఎంత ఖర్చైనా సరే, ఏదో ఒక విధంగా స్వస్థతను చేకూర్చుకొనవలెనను ప్రయత్నముతో తన యొద్ద నుండిన ధనమంతటిని వ్యయము చేసుకొన్నది (మార్కు 5:26).

తన అరోగ్య సమస్య ఎవ్విధంగానైనను నయము కానందునుబట్టి, ఆ స్త్రీ శిష్టాచార సంబంధముగా ఎడతెరిపిలేకుండా అపవిత్రురాలై యుండినది – అది ఆమెకు అవమానము మరియు దౌర్భాగ్య పరిస్థితిని కలుగజేసింది. శిష్టాచార సందర్భముగా ఆమె తాకినది ఏదైనను అపవిత్రమయ్యింది లేక ఎవరైనను అపవిత్రులయ్యారు (లేవీయకాండము 15:19–27). ఆమె తన యౌవనములో అనగా, పదమూడు మొదలుకొని పంతొమ్మిది సంవత్సరముల వయస్సులో ఉన్నప్పుడు ఈ దుస్థితి ఏర్పడియుండినట్లయితే, ఆమెను వివాహమాడుటకు ఎవరును ఇష్టపడెడివారు కాదు. ఆమెకు వివాహమైన తరువాత ఈ పరిస్థితి ఏర్పడియుండినట్లయితే, భార్యభర్తలిరువురు లైంగిక సంభోగ సంబంధములు కలిగియుండుట చట్టవిరుద్ధమయ్యేదే (లేవీయకాండము 18:19). తత్ఫలితంగా, ఆమె సంతానము కలుగని స్త్రీగానే మిగిలిపోయేది, ఈ పరిస్థితి సాధారణంగా విడాకులకు దారితీయుచుండినది. అపవిత్రురాలై యుండినందునుబట్టి, దేవుని ఆరాధించుటకు ఆమె దేవాలయమునకు గాని, బహిరంగముగా సంత నిర్వహింపబడుచుండిన స్థలాల్లోనికిగాని వెళ్లలేకుండినది. ఆమె పరిస్థితి నలువైపుల వేధింపబడుచుండిన దయనీయమైన దుస్థితియై యుండినది.

ఇట్టి దుస్థితిలో ఉండిన ఆమె నలుగురి యెదుటికి వచ్చుటకు వెనుకంజ వేయుచుండినది, గనుక **ఆమె ఆయన వెనుకకు వచ్చినది**. యేసు యొద్దకు వచ్చి ఆయన యెదుట సాగిలపడిన సమాజమందిరపు అధికారి ప్రదర్శించిన ధైర్యమునకు తారతమ్యముతో (9:18), ఆమె ప్రదర్శించిన పిరికితనముతో కూడిన గుట్టు కొట్టవచ్చినట్లు కనబడుచున్నది. ఆమె ఆయన **పై వస్త్రము మాత్రము ముట్టితే,** బాగుపడుదునని నమ్ముచూ, యేసు **ఆమెను స్వస్థపరచుటకు** కలిగియుండిన శక్తిలో ఆమె విశ్వాసముంచినది (14:36; అపొస్తలుల కార్యములు 5:15; 19:11, 12 చూడు).

**ఆయన పై వస్త్రపు చెంగు,** వారు దేవుని ప్రజలైయున్నారని వారికి గుర్తుచేయునట్లు యూదులైన పురుషులు ధరించుచుండిన వెలుపలి వస్త్రముల అంచులకుండిన కుచ్చులను సూచింపవచ్చును (సంఖ్యాకాండము 15:37–41; ద్వితీయోపదేశకాండము 22:12; మత్తయి 14:36; 23:5 చూడు). ఆ స్త్రీ యేసు ధరించి యుండిన పైవస్త్రపు చెంగును (కుచ్చును) ముట్టినప్పుడు, "వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక శరీరములోని ఆ బాధ నివారణయైనదని గ్రహించుకొనెను" (మార్కు 5:29). ఆ స్త్రీ తాను స్వస్థపరచబడిన అనుభూతిని పొందినది, యేసు కూడ ఆయనను ఎవరో తాకారను అనుభూతి పొందాడు. ఆయన "తనలో నుండి ప్రభావము బయలువెళ్లెనని తనలో తాను గ్రహించెను" (మార్కు 5:30).

**వచనము 22.** అప్పుడు యేసు జనసమూహము వైపు తిరిగి, "నా వస్త్రములు ముట్టినదెవరని" అడిగాడు (మార్కు 5:30). జనసమూహము యేసుపై పడుచుండిన పరిస్థితి

దృష్ట్యా, శిష్యులు దిగ్భ్రాంతిచెందారు (మార్కు 5:31). యేసు ప్రదర్శించిన ప్రతిస్పందన ఆ స్త్రీని భయపెట్టినది. గనుక ఆమె “భయపడి వచ్చి, వణకుచువచ్చి, ఆయన ఎదుట సాగిలపడి” (మార్కు 5:33) ఆయన పైవస్త్రపు చెంగును తాకినది ఆమెయేనని తన సంగతి యంతయు ఆయనతో చెప్పెను. అపవిత్రురాలైన ఒక ఆడదానిగా, బుద్ధిపూర్వకంగానే ఆమె దేవుని పరిశుద్ధుడైన ఒక పురుషుని బహిరంగముగా తాకినదని అందరి యెదుట ఆమె ఒక విడ్డూరమైన అనుభూతిని కలుగజేయు దృశ్యముగా చేయబడునని, నిస్సంశయముగా ఆమె భయపడినది.

అప్పుడు **యేసు కుమారీ, ధైర్యముగా నుండుము నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచినదని** చెప్పుచు ఆమెకు అభయముతో కూడిన ఆదరణను కలుగజేసాడు. “ధైర్యముగా ఉండుము” అను మాటలు అంతక మునుపు యేసు పక్షవాయువుగల వానితో పలికిన విషయాన్ని మనకు గుర్తుచేయుచున్నవి: “కుమారుడా, ధైర్యముగా ఉండుము” (9:2). ఎంతో భయపడుచుండిన ఆమెకు అవసరమై యుండిన ఆదరణను మరియు ఊరటను యేసు ఆమెకనుగ్రహించాడు. ఆయన పలికిన మాటలు, ఆమె అనారోగ్యస్తురాలై యుండినప్పటికిని, ఆయన దృష్టిలో నిజముగా ఆమె ఎంతో విలువైన వ్యక్తియైయున్నదను అభయమును ఆమెలో కలుగజేసాయి. యేసు ఆమె “విశ్వాసమును” ప్రశంసించాడు. యేసు ఆమె దౌర్బల్యమును స్వస్థపరచుటకు శక్తిగలవాడై యున్నాడని ఆమె ఆయనయందు కలిగియుండిన విశ్వాసము, తన వంతుగా తాను చేయవలసిన కార్యము చేయునట్లు అనగా యేసు పైవస్త్రపు చెంగును తాకునట్లు, ఆమెను పురికొల్పినది. తత్ఫలితంగా, ఆమె దేవుని చేత “బాగుపడినది.” ఆ స్త్రీ యేసు పైవస్త్రపు చెంగును తాకిన తత్క్షణమే ఆమె స్వస్థతనొందినదని మార్కు 5:29 మరియు లూకా 8:44 సూచించుచున్నవి. “బాగుపడినదని” (*sōizō*) అనువదింపబడిన గ్రీకు క్రియాపదము, అధ్యాత్మిక రక్షణ గూర్చి చర్చింపబడు సందర్భములలో “రక్షించుట” యని తరుచుగా అనువాదింపబడినది. ఇచ్చుటదాని ప్రయోగము విశ్వాసము మరియు రక్షణకు మధ్యగల సంబంధమును నేర్పుగా సూచింపవచ్చును.

యేసు ఆ స్త్రీని స్వస్థపరచిన తరువాత, చిన్నది చనిపోయినది తెలియజెప్పుచు, బహుశా యాయీరు ఇంటి నుండి వచ్చినవారు కావచ్చును, అచ్చట నుండిన వారిని యింకా ఎక్కువ మంది కలుసుకొన్నారు (మార్కు 5:35). యేసు వారి వ్యాఖ్యానమును యాదృచ్ఛికంగా విన్నాడు గనుక యాయీరుతో, “భయపడకుము, నమ్మికమాత్రముంచుమని” చెప్పాడు (మార్కు 5:36). అప్పుడు వారందరు కలిసి యాయీరు ఇంటికి వెళ్లారు కానీ ఈ సమయంలో, యేసు ఆయనకు అత్యంత సన్నిహితముగా నుండు శిష్యులను – పేతురు, యాకోబు, మరియు యోహాను – మాత్రమే ఆయనతో కూడ వెళ్లుటకు అనుమతించాడు (మార్కు 5:37).

**వచనము 23**. **ఆ అధికారి ఇంటికి వారందరు చేరుకొనినప్పుడు,** యేసుకు **జనసమూహము** ఎదురయ్యారు మరియు ఆ చిన్నది మరణించినదను సంకేతముల నిచ్చుచుండిన పిల్లన గ్రోవుల శబ్దములను ఆయన విన్నాడు. అంత్య క్రియల సందర్భములలో తరచుగా కిరాయి ప్రలాపకులు నియమించుకొనబడుచుండిరి వీరిలో **పిల్లన గ్రోవులు** వాయించువారును, విలపించుచుండువారును ఉండిరి (యిర్మీయా 9:17, 18; 48:36; ఆమోసు 5:16).[8] ఇశ్రాయేలీయులలోని పురుషుడు అతడెంతటి

నిరుపేదయైనప్పటికిని, అతని అర్ధాంగి మరణించినప్పుడు, రెండు పిల్లన గ్రోవులు మరియు ఆమె నిమిత్తము ప్రలాపించుటకు ఒక స్త్రీని కిరాయికి నియమించుకొనవలసి యుండునని ఒక యూదా మత బోధకుల సాంప్రదాయము చెప్పుచున్నది.[9] యాయీరు ఇంటి యొద్ద విలపించుచుండినవారు ఎంతో మంది కూడుకొని గొల్లు **చేయుచుండుట,** అతడు గొప్ప పలుకుబడి కలిగియుండిన అధికారియై యుండెనను వాస్తవమును వివరించుచున్నది. పిల్లనగ్రోవులు రెల్లు, పేము, మరియు ఎముకలతో తయారు చేయబడినవి. అవి సులభముగా తయారు చేయబడినవి మరియు సామాన్య ఉపయోగము కొరకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండినవి. పదేపదే, పిల్లన గ్రోవి వాయింపబడుచుండిన అదే సమయంలో "చప్పట్లు కూడ కొట్టబడుచుండినవి."[10]

**వచనము 24.** అంగలార్చువారు యాయీరు ఇంటి యొద్ద చాలా త్వరగా కూడుకొన్నారు, ఏలయనగా ఒకని అంత్య క్రియలు విలక్షణముగా అతడు చనిపోయిన అదే దినము నిర్వహింపబడుచుండినవి (అపొస్తలుల కార్యములు 5:5, 6, 10). ఏదిఏమైనా, ఇంటి లోపలి నుండి ప్రతి ఒక్కరు బయటకు వెళ్లవలెనని యేసు గట్టిగా చెప్పాడు, **స్థలమియ్యుడి ఈ చిన్నది నిద్రించుచున్నదే గాని చనిపోలేదని** పలికాడు. అయితే అచ్చట గుమికూడియుండిన ప్రజలు ఆ చిన్నది మరణించినదని ఎరిగి, ఆయన పలికిన మాటలను **అపహాస్యము** చేయుచుండిరి (9:18; మార్కు 5:35; లూకా 8:49, 53). ఆమె నిద్రించుచుండినది మరణ నిద్ర అనియు, గనుక ఆమెను మరలా లేపుటకు ఆయనకు అధికారము కలదను విషయమును మించి యేసు మరేమియు భావించలేదు. విల్యమ్ బార్క్లే ఇలా వివరించాడు.

> ఆ చిన్నది నిద్రించుచుండినదని యేసు చెప్పినప్పుడు, అక్షరాలా ఆమె నిద్రించుచున్నదనునదే ఆయన భావమై యున్నదను విషయము బహుగా సంభావ్యమై యున్నది. ఆంగ్లములో వలెనే గ్రీకులో కూడ, మరణించినవాడు తరచుగా గాఢనిద్రలో ఉన్నాడని చెప్పుకొనబడినది. వాస్తవమునకు, ఆంగ్లములో *cemetery* సిమెటరి – అనగా సమాధుల తోట – అను పదము *koimētērion* అను గ్రీకు పదము నుండి ఉత్పత్తియై, *ప్రజలు నిద్రించు స్థలమను* అర్థము నిచ్చుచున్నది. గ్రీకులో *నిద్రను* సూచించు రెండు పదములున్నవి: ఒకటి *koimasthai* ఇది స్వాభావిక నిద్రను మరియు చావు నిద్రను ప్రస్తావించుటకు అతి సామాన్యముగా ప్రయోగింపబడు పదమై యున్నది. మరొకటి *katheudein* చావు నిద్ర గూర్చి అంత తరచుగా ప్రయోగింపబడదు, కానీ అతి సామాన్యముగా అది స్వాభావికమైన నిద్రయను అర్థము నిచ్చును. ఈ వాక్యభాగములో *katheudein* అను పదము ప్రయోగింపబడినది.[11]

జాక్ పి. లూయిస్ ఇలా వ్రాయుచున్నాడు,

> నిద్ర తరుచుగా మరణమును వర్ణించుచుండు క్రొత్త నిబంధన పదమై యున్నది. ఇది పాత నిబంధనలో నుండి స్వాయత్తం చేసికొనబడినది (*katheudein*; అను అర్థము కొరకు దానియేలు 12:2; 1 థెస్సలొనీకయులకు 5:10; మరియు *koimaomai* అను అర్థము కొరకు: యోహాను 11:11; మత్తయి 27:52; అపొస్తలుల కార్యములు 7:60; 1 కొరింథీయులకు 15:6; 1 థెస్సలోనీయులకు 4:13–15). ఈ రూపకాలంకారములో పునరుత్థాన నిశ్చయత కలిసి యున్నది. మరణము, తాత్కాలికమే, ఈ నిద్ర నుండి లేపుటకు యేసుకు అధికారమున్నది.[12]

**వచనము 25.** అంగలార్చుచుండినవారు అచ్చట నుండి వెళ్లిపోయిన తరువాత, ఈ అద్భుతమును వారు కళ్లారా చూచుటకు ఆ చిన్నదాని తల్లిదండ్రులు - యేసు, పేతురు, యాకోబు, మరియు యోహానుతో కూడ - అచ్చట ఉండిరి (మార్కు 5:37, 40). యేసు లోపలికి వెళ్లి ఆ చిన్న దాని **చెయ్యి పట్టుకొన్నాడు**, తద్వారా "నీవు వచ్చి నీ చెయ్యి ఆమె మీద ఉంచుమని" ఆమె తండ్రి యేసు యొద్దకు వచ్చి చేసిన మనవిని ఆయన నెరవేర్చాడు (9:18). యేసు ఆ చిన్నదానితో చెప్పిన మాటలను మత్తయి పేర్కొనుటలేదు, కానీ "తలీతాకుమీ!" అని యేసు పలికాడని మార్కు నివేదించుచున్నాడు (మార్కు 5:41). ఈ మాటకు, "చిన్నదానా, లెమ్మని నీతో చెప్పుచున్నానని" అర్థము. ఇదొక అరమెయిక్ పదజాలమై యున్నది, "చిన్న గొఱ్ఱెపిల్లా, లెమ్మని నేను నీతో చెప్పుచున్నాను" అనునది దీని అక్షరార్థమై యున్నది.

యేసు ఆమెను ముట్టి ఈ మాటలు పలికిన వెంటనే **ఆ చిన్నది లేచి నడవసాగెను** (మార్కు 5:42 చూడు). "*ఆమె ప్రాణము తిరిగి వచ్చెను* గనుక వెంటనే ఆమె లేచెను" (నొక్కి చెప్పింది నేను) అనియు, అప్పుడాయన "ఆమెకు భోజనము పెట్టుడని" వారికి ఆజ్ఞాపించెననియు లూకా చెప్పుచున్నాడు (లూకా 8:55).

రక్తస్రావ రోగము బాధపడుచుండిన స్త్రీకి వలెనే, యేసు మరొక పర్యాయము అపవిత్రతను తాకాడు; ఆయన చనిపోయిన చిన్నదాని శవమును ముట్టుకొన్నాడు (సంఖ్యాకాండము 19:11-21). ఈ రెండు సందర్భములలో కూడ, ఆయన తనను తానే మాలిన్యము గావించుకొనుటకు బదులుగా స్వస్థపరచుటకు ఆయన కలిగియుండిన శక్తి చేత యేసు వారినే పవిత్రులను గావించాడు. ఆయనకు ముందుండిన ప్రవక్తల వలెను, ఏలీయా మరియు ఎలీషా (1 రాజులు 17:17-24; 2 రాజులు 4:17-37), ఆయన తరువాత వచ్చిన అపొస్తలుల వలెను, పేతురు మరియు పౌలు (అపొస్తలుల కార్యములు 9:36-42; 20:9-12). యేసు మృతులైన వారిని మరలా సజీవులను గావించాడు (9:25; లూకా 7:11-17; యోహాను 11:38-46). యేసు నిర్జీవులను మరలా సజీవులను గావించాడను వాస్తవము ప్రజలకు మెస్సీయ సంబంధిత సంకేతము వలె ప్రయోజనకరమైనదిగా పనికివచ్చినది (11:4, 5). ఏదిఏమైనా, అన్నిటిలో అత్యంత గొప్పదైన సూచకక్రియ ఆయన సొంత పునరుత్థానమే. చనిపోయిన యాయీరు కుమార్తెను మరలా లేపుచు నిస్సందేహముగా ఆది కాలమందలి చదువరులకు "వారి సొంత పునరుత్థానము గూర్చి ముందు ఛాయను" గూర్చి తెలియజేసినది.[13] ప్రభువునందు మృతులైనవారు కేవలము "నిద్రించుచున్నవారై" యున్నారు యేసు క్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు వారు లేపబడుదురు (1 థెస్సలొనీకయులకు 4:14, 15).

**వచనము 26.** అచ్చట నుండినవారు జరిగిన అద్భుత కార్యము గూర్చి ఎవనికిని తెలియజేయకూడదని ఆయన వారికి "గట్టిగా ఆజ్ఞాపించాడు" (మార్కు 5:43; లూకా 8:56 చూడు). అట్లయినప్పటికిని, **ఈ సమాచారము ఆ దేశమందతటను వ్యాపించెను.** ఈ అద్భుత కార్యమును రహస్యముగా నుంచుట కష్టమే, ఏలయనగా ఆ చిన్నది చనిపోయిన సంగతి అంగలార్చుచుండిన వారందరికి తెలిసిన విషయమే. అమె మరలా సజీవురాలయ్యిందని వారు తెలిసికొనినప్పుడు, యేసునకు మరణముపై అధికారముండినదను వార్త ఆ ప్రదేశమంతటను శరవేగంతో వ్యాపించియుండును!

## ఇద్దరు గ్రుడ్డివారిని స్వస్థపరచుట (9:27-31)

**[27]యేసు అక్కడనుండి వెళ్లుచుండగా ఇద్దరు గ్రుడ్డివారు ఆయన వెంట వచ్చి-దావీదు కుమారుడా, మమ్మును కనికరించుమని కేకలువేసిరి. [28]ఆయన యింట ప్రవేశించిన తరువాత ఆ గ్రుడ్డివారు ఆయనయొద్దకు వచ్చిరి. యేసు-నేను ఇది చేయగలనని మీరు నమ్ముచున్నారా? అని వారి నడుగగా వారు-నమ్ముచున్నాము ప్రభువా అని ఆయనతో చెప్పిరి. [29]అప్పుడాయన వారి కన్నులు ముట్టి-మీ నమ్మికచొప్పున మీకు కలుగుగాక అని చెప్పినంతలో వారి కన్నులు తెరువబడెను. [30]అప్పుడు యేసు-ఇది ఎవరికిని తెలియకుండ చూచుకొనుడని వారికి ఖండితముగా ఆజ్ఞాపించెను. [31]అయినను వారు వెళ్లి ఆ దేశమంతట ఆయన కీర్తి ప్రచురముచేసిరి.**

**వచనము 27**. ఆయన వారిని కనికరించి స్వస్థపరచవలెనను మరిన్ని మనవులతో మరొక సారి ఆటంకపరచకుండా యేసు ఎంతో దూరము ముందుకు వెళ్లలేకపోయాడు: **ఇద్దరు గ్రుడ్డివారు ఆయన వెంట వచ్చి - దావీదు కుమారుడా, మమ్మును కనికరించుమని కేకలు**వేసిరి.[14] పారిశుధ్యము లేని పరిస్థితులు, రోగ సంక్రమణము, హానికరమైన క్రిములు, గాలికి ఎగిరి వచ్చి కళ్లలో పడుచుండిన ఇసుక రేణువులు, ప్రమాదములు రణ రంగ గాయములు, అనుచితాహారము, ప్రసవ సమయంలో ఎదురైన సమస్యలు, లేక తీవ్రమైన వేడి మొదలగు వారి అంధత్వమునకు హేతువులై యుండవచ్చును.

"కేకలు వేసిరి" అని అర్థమిచ్చు గ్రీకు పదము (krazō) బిగ్గరగా అరచుట లేక ఎలుగెత్తి తీవ్రమైన శబ్దముతో పిలుచుట యని సూచించుచున్న పదమై యున్నది. ఆ ఇద్దరు గ్రుడ్డివారు రెండు కారణములనుబట్టి ఇలా కేకలు వేసి యుందురు. ఆయన దృష్టిని ఆకర్షింపవలెనని వారాశించారని స్పష్టముగా తెలియుచున్నది. ఇంకా, వారి స్వరములు ఆ త్రోవను వెళ్లుచుండిన జనసమూహముల వలన కలుగుచుండిన శబ్దమును మించినవై యుండవలసి యుండెను, అప్పుడే వారి మాట ఆయనకు వినిపించును. యేసు వారిని "కనికరింపవలెనని" వారాయనను పిలిచారు, మత్తయి వ్రాసిన సువార్తలో ఇదొక సామాన్యమైన వినతియై యున్నది (15:22; 17:15; 20:30, 31). ఈ ఇద్దరు గ్రుడ్డివారు యేసు యొక్క మెస్సీయాత్వమును గుర్తించారని స్పష్టముగా తెలియుచున్నది, ఏలయనగా వారు "దావీదు కుమారుడు" అను బిరుదును ఉపయోగించారు. రానై యుండిన మెస్సీయాకు అత్యంత సామాన్యమైనవై యుండిన బిరుదులలో ఇదొకటి (1:1; 12:23; 15:22; 20:30, 31; 21:9, 15; 22:42; మార్కు 10:47, 48; 12:35; లూకా 18:38, 39; 20:41; 2 సమూయేలు 7; కీర్తనలు 89 చూడు).

ఈ ఇద్దరు గ్రుడ్డివారు ప్రచురము చేయుచుండిన మెస్సీయాత్వ బిరుదునకు అదనంగా, యేసు వారి కనుదృష్టిని బాగుచేయుట, ఆయన మెస్సీయ సంబంధమైన ఎదురుచూపులు నెరవేర్చుచున్నాడనుటకు సంకేతములను జారీ చేసినది. డొనాల్డ్ ఏ. హేగ్నర్ ఇలా సూచించాడు, "వాగ్దానము చేయబడినవాడు, అనగా మెస్సీయ, యేసేనా కాదా యను విషయము గూర్చి బాప్తిస్మమిచ్చు యోహాను అడిగిన ప్రశ్నకు సమాధానమును సమకూర్చుచున్న జాబితాలో, ఆయన గ్రుడ్డివారికి [tuphloi] చూపు దయచేయుట మొదట పేర్కొనబడినది (11:5)."[15]

**వచనము 28**. యేసు **యింట**, అనగా కపెర్నహూములో ఆయన నివాసముండిన స్థలమని భావింపబడుచున్న చోటు లోనికి ప్రవేశించాడు. ఆ ఇద్దరు గ్రుడ్డివారు యేసు వెంట వెళ్లారు గనుక ఆ ఇంటి లోనికి వారు కూడ ఆహ్వానింపబడిరి. కనికరము కొరకు వారు బిగ్గరగా కేకలు వేయుట ద్వారా వారు వారి విశ్వాసమును ప్రదర్శించినప్పటికిని (9:27), యేసు వారిని పరీక్షించాడు: **నేను ఇది చేయగలనని మీరు నమ్ముచున్నారా?** అని ఆయన వారినడిగాడు. వారు **నమ్ముచున్నాము, ప్రభువా** అని వెంటనే సమాధానమిచ్చారు.

**వచనము 29.** ఇతర గ్రుడ్డివారికి దృష్టి దయచేసిన సందర్భములలో, యేసు కొంచెము అసాధారణమైన కార్యములు చేసాడు (మార్కు 8:22-26; యోహాను 9:6, 7). ఏదిఏమైనా, ఈ ఇద్దరు గ్రుడ్డివారి విషయంలో ఆయన కేవలము **వారి కన్నులను ముట్టి, మీ నమ్మిక చొప్పున మీకు కలుగుగాక** అని వారితో చెప్పాడు. మరొక పర్యాయము, యేసు తాకిడిలో గల శక్తి ఉద్ఘాటించబడినది (8:3, 15; 9:18, 20, 21, 25). యేసు చేత స్వస్థపరచబడిన ప్రతి ఒక్కరిలో విశ్వాసము ఉండవలసిన అవసరం లేకుండినను, యేసు ఇచ్చట ఆ గ్రుడ్డి వారితో పలికిన మాటలను తరుచుగా పలుకుచుండెను (8:13; 9:22 చూడు). ఇలా పలుకుటలో నిర్దిష్టమైన ఒక వ్యక్తి యొక్క నిబద్ధతను పరీక్షింపవలెనను ఉద్దేశము ఉండియుండవచ్చును. "వారి విశ్వాసమును వృద్ధిపొందించుటకు ఇదొక సాధనమై యుండినదని" డి. ఏ. కార్సన్ ప్రతిపాదించాడు.[16]

**వచనములు 30, 31. వారి కన్నులు తెరువబడెను** అను మాటలను వారి కనుచూపు పునరుద్ధరింపబడినదని మామూలు మాటల్లో చెప్పుకొనవచ్చును. వారు చూపు పొందిన తరువాత యేసు, **ఇది ఎవరికిని తెలియకుండ చూచుకొనుడని వారికి ఖండితముగా ఆజ్ఞాపించెను!** ఈ అద్భుత కార్యము యింటిలో జరుగుట వలన (9:28), ఈ విషయము రహస్యముగా ఉంచబడుటకు అవకాశములు మెండుగా ఉండినవి. మరొకసారి, వారు స్వస్థత నొందిన సత్యమును ఇతరులెవరికిని తెలియకుండ చూచుకొనవలసినదని కఠినముగా ఆజ్ఞాపింపబడినప్పటికిని, స్వస్థతనొందినవారు **వెలుపలకు వెళ్లి ఆ దేశమందంతటను ఆయన గూర్చిన కీర్తిని ప్రచురము చేసిరి** (8:4; 9:26పై గల వ్యాఖ్యానములను చూడు).

బహుశా చూపు పొందిన ఈ ఇద్దరు గ్రుడ్డివారు కేవలము వారిలో కలిగిన ఉత్తేజనమునుబట్టి వారి స్వస్థత గూర్చిన వార్తను ఇతరులకు తెలియజెప్పియుందురు, లేదా ఈ మహా వైద్యుని గూర్చి ఇతర రోగులు సహితము తెలిసికొని స్వస్థతనొందవలెనని ఆశించియుందురు. హేతువులేవైనా, వాటితో నిమిత్తము లేకుండా వారు స్వస్థతనొందారను వార్త వ్యాపించుట యేసు వారికిచ్చిన ఆజ్ఞకు వారు అవిధేయులయ్యారనే చెప్పుకొననగును. ఆయన వారికి ఆజ్ఞాపించినట్లు చేయకుండుటకు విఫలులగుట ద్వారా ఈ గ్రుడ్డివారు యేసు వారి యెడల ప్రదర్శించిన కనికరమునకు తిరిగి చెల్లించుకొన్నారు.

## దయ్యము పట్టిన మూగవానిని స్వస్థపరచుట (9:32-34)

**[32]యేసును ఆయన శిష్యులును వెళ్లుచుండగా కొందరు, దయ్యముపట్టిన యొక మూగవాని ఆయనయొద్దకు తీసికొని వచ్చిరి. [33]దయ్యము వెళ్లగొట్టబడిన తరువాత ఆ మూగవాడు మాటలాడగా జనసమూహములు ఆశ్చర్యపడి-ఇశ్రాయేలులో ఈలాగు ఎన్నడును**

**కనబడలేదని చెప్పుకొనిరి. [34]అయితే పరిసయ్యులు–ఇతడు దయ్యముల అధిపతివలన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని చెప్పిరి.**

**వచనము 32.** దయ్యము పట్టిన ఇతడు ఇంతకు క్రితమే చూపు పొందిన గ్రుడ్డివారి చేత యేసు యొద్దకు తీసికొనిరాబడెనా? ఇది ఆ గ్రుడ్డివారు చేసిన పనే అని చెప్పుకొనుటకు వాక్యభాగములో ఆధారమేదియును లేదు గనుక, యేసు వారికి అంత కఠినముగా సెలవిచ్చిన ఆజ్ఞకు అవిధేయులై వారు ఇంతలోనే తిరిగి రాగలరనునది అనుమానమే. **వారు వెళ్లుచుండగా అనునది మరియు ఆయన అనే సర్వనామము,** యేసు మరియు ఆయన శిష్యులను గూర్చి స్పష్టముగా తెలుపుతున్నది. గనుక **దయ్యముపట్టిన మూగవానిని** యేసు యొద్దకు ఇతరులు తీసికొనివచ్చారని చెప్పుకొనుట ఉత్తమము.

**మూగా** (kōphos) అను మాటకు ఇచ్చట వాడబడిన పదము చెవిటితనము (11:5) మరియు మాటలాడలేని అసమర్థతను (12:22) కూడ కలుపుకొనినదై యున్నది. ఈ రెండు దౌర్బల్యములు తరుచుగా కలిసి యుండును, ఏలయనగా వినలేనివాడు మాట లాడుటకు నేర్చుకొనుటలో విఘ్నము కలుగజేయబడును. ఇప్పటి సందర్భములో, ఇతడు మాటలాడలేకుండెనని మాత్రమే మనకు తెలియుచున్నది, ఏలయనగా ఈ స్వస్థత అద్భుతకార్యము యొక్క ఫలితము "మూగవాడు మాటలాడెను" అని వ్రాయబడియున్నది (9:33). వాడు దయ్యముపట్టి పీడింపబడుట చేత మూగవాడై యుండెను. దయ్యములు అసంఖ్యాకమైన శారీరక సమస్యలను కలుగజేసాయి: మూగతనము, చెవిటితనము, గ్రుడ్డితనము, స్వయంనిరూపణము, వంపులు తిరుగుట, లొంగకుండా గట్టిగా బిగుసుకపోవుట, పళ్లు కొరుకుట, నోటి నుండి నురుగు కారుట మొదలగు (12:22; మార్కు 1:26; 5:5; 9:18, 25).

**వచనములు 33, 34.** యేసు **దయ్యమును** వెళ్లగొట్టిన **వెంటనే, మూగవాడు మాటలాడసాగెను.** అప్పుడు ప్రజలు ప్రదర్శించిన ప్రతిస్పందన యేమిటి? మొదటిది, జనసమూహములు ఆశ్చర్యపడిరి. వారు, **ఇశ్రాయేలులో ఈలాగు ఎన్నడును కనబడలేదని** చెప్పుకొనిరి. పాతనిబంధన అద్భుత కార్యములతో నిండియున్నదైనప్పటికిని, యేసు చేత చేయబడిన అద్భుత కార్యముల సంఖ్య మరియు వైవిధ్యము ఇశ్రాయేలు చరిత్రలో అసమానమైనదై యున్నది. "ఆశ్చర్యపడిరి" అను అర్థమిచ్చు గ్రీకు పదము (*thaumazō*), "విస్మయముచెందిరి" అని కూడ అనువదింపబడినది, అమితముగా ఆశ్చర్యపడిరి లేక భక్తి సంభ్రమమును కలిగించు భయముతో నిండిపోయిరి అను ధ్వనింపునిచ్చుచున్నది. యేసు చేయుచుండిన అద్భుతముల సంఖ్య మొత్తము మరియు వాటి నానావిధత్వము పెరిగిపోవుచుండగా, ప్రజలు అంతకంతకు అధికంగా అబ్బురపడుచుండిరి.

రెండవదిగా, **పరిసయ్యులు** ప్రదర్శించిన ప్రతిస్పందన సాధారణ యూదా జనసమూహము ప్రదర్శించిన దానికి నాటకీయముగా భిన్నమైనదై యుండినది. యేసు **దయ్యముల అధిపతి వలన**, అనగా "బయల్జెబూలు" వలన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని వారు చెప్పుకొనుచుండిరి (12:24; మార్కు 3:22 చూడు). యేసునకు దయ్యములను వెళ్లగొట్టగల సామర్థ్యము దేవుని నుండి రాలేదు లేదా పరిశుద్ధాత్మ వలన కలుగలేదు, కానీ దయ్యము వలననే కలిగినదని పరిసయ్యులు చెప్పుకొనుచుండిరి. వారు ఆరోపించుచుండిన

అభియోగమునకు యేసు ప్రతిస్పందించిన విషయము మత్తయి 12:25-30లో వ్రాయబడి యున్నది:

> తనకు తానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడైపోవును. తనకుతానే వేరుపడిన యే పట్టణమైనను ఏ యిల్లయినను నిలువదు. సాతాను సాతానును వెళ్లగొట్టినయెడల తనకుతానే విరోధముగా వేరుపడును అట్లయితే వాని రాజ్యమేలాగు నిలుచును? నేను బయెల్జెబూలువలన దయ్యములను వెళ్లగొట్టుచున్న యెడల మీ కుమారులు ఎవరివలన వాటిని వెళ్లగొట్టుచున్నారు? కాబట్టి వారే మీకు తీర్పరులైయుందురు. దేవుని ఆత్మవలన నేను దయ్యములను వెళ్లగొట్టుచున్నయెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది. ఒకడు మొదట బలవంతుని బంధింపని యెడల యేలాగు ఆ బలవంతుని యింటిలో చొచ్చి అతని సామగ్రి దోచుకొనగలడు? అట్లు బంధించినయెడల వాని యిల్లు దోచుకొనును. నా పక్షమున నుండనివాడు నాకు విరోధి నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడు.

పరిసయ్యులు మోపుచుండిన ఈ అభాండము యొక్క ఉద్దేశము యేసు చేయుచుండిన అద్భుత కార్యములకు గల మూలాధారము ఆయన సొంతం కాదని ఆక్షేపించుటయై యుండినది. వారు అద్భుత కార్యములను సూటిగా ఆక్షేపించలేకపోయారు ఏలయనగా యేసు చేయుచుండిన అద్భుత కార్యములు అసంఖ్యాకములై యుండినవి, ఇంతేగాక వీటి మూలమున జనసమూహములు ఆయన యందు విశ్వసించుచుండిరి. అట్లయినప్పటికిని, ప్రజలు ఆయన యందు యథార్థముగా విశ్వసించుచుండిరా లేక కేవలము ఆయన చేయుచుండిన అద్భుత కార్యములను నమ్ముచుండిరా యని మనము ఆశ్చర్యపడునట్లు చేయబడుచున్నాము.

పరిసయ్యులు జనసమూహముల ప్రతిస్పందనకు భయపడుచుండి నందునుబట్టి, వారు – అద్భుత కార్యములు చేయబడలేదనుట లేక వాటిని కాదనుట ద్వారా గాని కాదు కానీ వాటి మూలాధారము దుష్టునికి, అనగా "దయ్యముల అధిపతియైన బయల్జెబూలుకు" సంబంధించినదై యున్నదని ఆరోపించుట ద్వారా – యేసునే అపఖ్యాతి పాలుజేయుటకు ప్రయత్నించారు. ఈ సమయంలో, యేసు పరిసయ్యులు మోపుచుండిన అపనిందను అలక్ష్యము చేయుచునే తన ప్రబోధ కార్యభారమును కొనసాగించాడు. వారు ఆయన మీద మోపుచుండిన నింద – కనీసము ఆయన పరిచర్యలోని ఈ సమయమందైనా – ఆయనకు వ్యక్తిగతముగా గాని లేదా ఆయన పరిచర్య పట్ల గాని బెదిరింపుగా నున్నట్లు ఆయన పరిగణించలేదని స్పష్టమగుచున్నది.

### యేసు పరిచర్య సారాంశము (9:35-38)

**35యేసు వారి సమాజమందిరములలో బోధించుచు రాజ్యసువార్త ప్రకటించుచు, ప్రతి**
**విధమైన రోగమును ప్రతి విధమైన వ్యాధిని స్వస్థపరచుచు, సమస్త పట్టణముల యందును**
**గ్రామములయందును సంచారము చేసెను. 36ఆయన సమూహములను చూచి, వారు**
**కాపరిలేని గొఱ్ఱెలవలె విసికి చెదరియున్నందున వారి మీద కనికరపడి 37-కోత విస్తారమే**
**గాని పనివారు కొద్దిగా ఉన్నారు. 38గనుక తన కోతకు పనివారిని పంపుమని కోత**
**యజమానుని వేడుకొనుడని తన శిష్యులతో చెప్పెను.**

9:35–38 గూర్చి ఆర్. టి. ఫ్రాన్స్ ఇలా వ్రాయుచున్నాడు,

> ఈ వచనములు ఒక ద్వంద్వ పాత్రను వహించుచున్నవి. అనగా 5–9 అధ్యాయములలో వ్రాయబడినట్లు యేసు చేసిన పరిచర్య సంబంధమైన ఒక సారాంశముగాను, [పరిమితమైనదైయున్న] 10వ అధ్యాయములో వ్రాయబడి యున్నట్లు శిష్యుల కార్యభారమునకు ఒక ఉపోద్ఘాతముగాను పనికివచ్చుచున్నవి. గ్రంథస్థంచేయబడిన మాటలు వెనుదిరిగి చూచుకొనుచు ముందుకు కూడ చూడగలుగునట్లును, ఈ పుస్తకములోని రెండు విభాగముల మధ్య గల కొనసాగింపును నొక్కివక్కాణించునట్లును జాగ్రత్తగా రూపుదిద్దుకొన్నవి.[17]

**వచనము 35.** ఈ వచనము దాదాపుగా అది ఉన్నది ఉన్నట్లుగానే 4:23 నుండి పునరుక్తము గావింపబడి, 5 మొదలుకొని 9వ అధ్యాయము వరకుగల విషయములను ఒక ప్రధానాంశముగా తీర్చిదిద్దుటకు పూనుకొన్నది, ఇందులో యేసు చేసిన ఉపదేశములు (5–7 అధ్యాయములు) మరియు అపొస్తలుల కార్యములు (8; 9 అధ్యాయుములు) చేర్చబడి యున్నవి. ఏదిఏమైనా, "గలిలయ యందంతటను" అను మాటల గూర్చిన ప్రస్తావన సమస్త **పట్టణముల యందును గ్రామముల యందును** అని అనుకూలింపబడినది. ఆ ప్రాంతములో క్రీస్తు కాలమునందు 240 పట్టణములు మరియు గ్రామములుండినవని జోసీఫస్ అంచనా వేసాడు.[18] మనము జోసీఫస్ సాక్ష్యమును అంగికరించినట్లయితే, యేసు ప్రతి రోజు రెండు పట్టణములను లేక గ్రామములను సందర్శించి యుండినట్లయితే, ఆ పట్టణములను లేక/మరియు గ్రామములన్నింటిని సందర్శించుటకు ఆయనకు నాలుగు మాసముల సమయం పట్టియుండును. ఏదిఏమైనా, మనము అక్షరార్థమును అత్యధికంగా నొక్కి చెప్పుకొనవలసిన అవసరం లేదు. యేసు గలిలయ ప్రాంతములో పరిచర్య చేసినప్పుడు ఇతరమైన అనేక కార్యములు ఆయన చేసాడనియు, తన చదువరులను మచ్చుతునకలుగా చూపింప నుద్దేశించి (యోహాను 20:30, 31; 21:25) ఆయన పరిచర్యలో నుండి ఎంపిక చేసుకొనబడిన కథలను మత్తయి ఎన్నుకొన్నాడనియు సారాంశ వాక్యము సూచించుచున్నది. యేసు, పట్టణములు మరియు గ్రామముల గుండా సంచరించుచు, ఆయన **వారి సమాజమందిరములలో బోధించుచు, రాజ్య సువార్త ప్రకటించుచు, ప్రతి విధమైన వ్యాధిని స్వస్థపరచుచుండెను** (4:23పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 36**. ప్రజల సంక్షేమము గూర్చి యేసు హృదయంలో లోతుగా పాతుకుపోయిన ఆందోళన ఉండినది. ఆయన వారి శారీరక సంక్షేమము గూర్చి ఆందోళన చెందుచుండెనని ఇతర స్థలములలో మనకు తెలియజెప్పబడుచున్నది (14:13, 14; 15:30–32; 20:34), కానీ ఇచ్చట ఆయన వారి ఆధ్యాత్మిక పురోగతి గూర్చి అందోళన చెందుచుండెను. తీవ్రమైన భావోద్రేకములను వర్ణించుటకు **కనికరపడి** అని అనువదింపబడిన క్రియాపదము వాడబడినది, సంబంధిత నామవాచకము (splanchna) ప్రేగులను సూచించుచున్నది. **విసికిపోవుట** అని అర్థమిచ్చు గ్రీకు పదము (skullō) క్షోభపెట్టబడుట లేక తీవ్రముగా బాధింపబడుట యను అభిప్రాయమును తెలియజేయుచున్నది. వారు నిస్సహాయ స్థితిలో ఉంటూ అటూ ఇటూ కొట్టుకొనిపోవుచున్నట్లుగా ప్రజలు ప్రవర్తించుచుండిరి, ఏ దిక్కు దెస, లేదా గమ్యమనునది లేకుండా నిరంతరము కదలివెళ్లుచుండిరి. వారు **చెదిరిపోయి** యుండిరి (rhiptō). "పారవేయు," అను అర్థము నిచ్చుచు ఈ క్రియాపదము క్రొత్త

నిబంధనలో తరచుగా వాడబడినది, కానీ "పడియుండుట" లేక "ఒక చోట క్రింద ఉంచబడుట" యను అభిప్రాయమును కూడ తెలియజేయగలదు. బహుశా, హేగ్నర్ సూచించుచున్నట్లుగా, ఈ పదజాలము " 'తికమకపడిన' లేక 'నిస్సత్తువగల' వంటి అర్థమిచ్చుటకు రూపకాలంకారములో వాడబడి యుండవచ్చును."[19]

జనసమూహముల ఆధ్యాత్మిక అవగాహన శూన్యమైనదనియు, వారు దిశానిర్దేశనము లేనివారై యుండినట్లును యేసు గమనించాడు, గ్రహించాడు. అందుకే ఆయన వారు **కాపరిలేని గొఱ్ఱెల వలె** ఉన్నారని వారిని వర్ణించాడు. ఈ అభివ్యక్తము తరచుగా పాత నిబంధనలో అగుపించుచున్నది (సంఖ్యాకాండము 27:17; 1 రాజులు 22:17; 2 దినవృత్తాంతములు 18:16; యెషయా 13:14; యెహెజ్కేలు 34:5; జెకర్యా 10:2; 11:5 చూడు) మరియు క్రొత్త నిబంధనలోను కనబడుచున్నది (మత్తయి 9:36; మార్కు 6:34). పాతనిబంధనలోని సాదృశ్యములలో గొఱ్ఱెల కాపరులు మరియు గొఱ్ఱెలు అను పదములు తరుచుగా ప్రయోగింపబడినవి (కీర్తనలు 23:1-6; 77:20; 78:52; 95:7; 100:3; యెషయా 40:11). ఆయన తనను గూర్చి తాను ప్రస్తావించుకొనుచు ఇదే ప్రతిరూపమును యేసు వినియోగించాడు (యోహను 10:11-16). గొఱ్ఱెల కాపరికిని గొఱ్ఱెలకును మధ్య సున్నితమైనది మరియు సన్నిహితమైన సంబంధము ఉండినది, ఆయన వాటిని పచ్చికబయళ్లలోనికి నడిపించుచుండెను, వాటిని అపహరించి అపాయమునకు గురిచేయు కొల్లగొట్టునట్టి జంతువుల నుండి ఆయన వాటిని కాపాడుచుండెను, అవి దారి తప్పి ప్రక్కలకు వెళ్లిపోయినప్పుడు వాటిని వెదక వెళ్లాడు (లూకా 15:3-7). యేసు గొఱ్ఱెలకు మంచి కాపరియై యుండెను (యోహాను 10:11; హెబ్రీయులకు 13:20-21; 1 పేతురు 2:25; 5:4 చూడు) కానీ ఆ రోజుల్లోని జీతగాళ్లు - పరిసయ్యులు, శాస్త్రులు మరియు యూదా మత బోధకులు - మందను విడిచిపెట్టి వెళ్లిపోయారు, గనుక అవి తమంతట తామే కాపాడి సంరక్షించుకొనవలసి యుండెను.

**వచనములు 37, 38**. అటుతరువాత గొఱ్ఱెల గూర్చిన రూపకాలంకరము నుండి తన దృష్టిని కోత వైపు మళ్లించాడు. **కోత విస్తారమే, గాని పనివారు కొద్దిగా ఉన్నారు** అని ఆయన తన శిష్యులతో చెప్పెను. సమరయను ఆయన సందర్శించినప్పుడు, "ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి, అవి ఇప్పుడే తెల్లబారి కోతుకు వచ్చియున్నవి" అని యేసు తన శిష్యులతో చెప్పాడు (యోహాను 4:35). తీసికొనుటకు అదొక మంచి తీర్మానమే అయినప్పటికిని, ఆయన కేవలము "నశించినవారి కొరకు ప్రార్థన చేయుడి" అని మాత్రమే సెలవియ్యలేదు. దానికి బదులుగా, **తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడి** అని కూడ ఆయన సెలవిచ్చాడు. యేసు రోజుల్లో, "కోత యజమానుడు" పని మనుష్యులను జీతమునకు పెట్టుకొనుచు వారిని తన పొలములోనికి పంపుచుండినవాడై యుండెను. వారికి దినబత్తెము చెల్లింపవలసిన బాధ్యత కూడ ఆయనదే. ఇతడు కోత గూర్చిన బాధ్యత అప్పగింపబడిన పెద్దయై యుండవచ్చును లేదా అసలైన భూస్వామియై యుండవచ్చును. యేసు చెప్పుచుండిన ఉపమానములో పనివారిని జీతమునకు పెట్టుకొని, తన ద్రాక్షాతోటలో పని చేయుటకు వారిని పంపించి, దినాంతమందు వారికి ఆనాటి దినబత్తెము చెల్లించుచుండిన భూస్వామియై యుండెను (20:1-16). ఈ సందర్భములో దేవుడు (లేక యేసు) "కోత యజమానుని" వలె చిత్రీకరింపబడి యున్నాడు, మరియు

ఆయన పొలము ఈ లోకమై యున్నది. సువర్తమానమును ప్రచురించుచు, రాజ్యములోనికి ఆత్మలను చేర్చువారు, పనివారై యున్నారు. కోత సంబంధిత మనఃకల్పన అంత్య తీర్పు సందర్భములో కూడ మరొక చోట వినియోగింపబడినది (3:12; 13:24–30, 36–43; ప్రకటన 14:14–20). పనివారు తక్కువగా ఉన్నారని పేర్కొనిన పిదప, కోత పొలములోనికి పంపించుటకు యేసు తన శిష్యులలో కొందరిని ఎన్నుకొన్నాడు (10:1).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### ఆటంకములను అధిగమించుట (9:20–22)

9:20–22లో పేర్కొనబడినట్లు యేసు పైవస్త్రపు చెంగును ముట్టుకొనిన స్త్రీ యేసును సమీపించగలుగునట్లు అనేక అడ్డంకులను అధిగమించవలసి యుండినది. మొదటిగా, ఆమె జనసమూహమును అధిగమించినది. ప్రజలనేకులు యేసు మీదికి "క్రిక్కిరిసి పడుచుండిరి" (లూకా 8:45); యేసును ముట్టకొనవలెనని లేదా కనీసము ఆయన పైవస్త్రపు చెంగును తాకితే చాలునని ఆయనను సమీపించునట్లు ఇతరులు సహితము ఎంతో మంది ముందుకు తోసుకొని వెళ్లుటకు ప్రయత్నించుచుండిరనుటలో ఎటువంటి సందేహము లేదు. రెండవదిగా, ఆమె బహిరంగముగా అవమానపరచబడి ఎగతాళిచేయబడు పరిస్థితిని ఎదుర్కొనుచుండినది కానీ ఆమె తన భయమును పారదోలి, జనసమూహము గుండా చొచ్చుకొని ముందుకు వెళ్లి, యేసు పైవస్త్రపు చెంగును ముట్టుకొనగలుగునంత సమీపముగా ఆయనను చేరుకొన్నది. మూడవదిగా, ఆమె బాగుపడకపోవచ్చునను భయమును కూడ ఎదుర్కొన్నది. అయితే ఆమె తెగించునట్లు తన విశ్వాసమే ఆమెకు అండగా నిలిచినది (9:22).

### దేవుని శక్తియందు నమ్మకముంచుట (9:27–31)

ఇద్దరు గ్రుడ్డివారు చూపుపొంద గోరుచు యేసు కొరకు వెదకుచుండిరి. "నేను ఇది చేయగలనని మీరు నమ్ముచున్నారా?" అని ఆయన వారినడుగుట ద్వారా యేసు వారి విశ్వాసమును పరీక్షించాడు (9:28). వారు ఆయనయందుంచిన విశ్వాసమును రూఢిపర్చుకొన్నారు, గనుక ఆయన తదనుగుణంగా వారికి కంటి చూపుననుగ్రహించాడు.

మనము ఈనాడు దేవుని శక్తిని నిజముగా నమ్ముచున్నామా? ప్రతి సంవత్సరము అనేక మంది అమెరికా దేశ వాసులు జయము పొందుటకు ప్రోత్సాహకము గూర్చిన పాఠ్యాంశ క్రమములను చదువుటకు ఎంతో డబ్బు వ్యయము చేయుచున్నారు. అత్యధికమైన ఈ పాఠ్యాంశ క్రమములలో, వారు తమ్మును తాము విశ్వసించవలెనని ప్రజలకు ఉపదేశింపబడుచున్నది. మనలను మనము నమ్ముటలో తప్పేమీ లేదు మనలను మనము నమ్మవలసినదే. ఏదిఏమైనా, మనము సొంతగా సరిదిద్దుకొనుటకు కొన్ని సమస్యలు మనకు అంతు చిక్కనివై యుండును. మనము దేవుని శక్తి యందు విశ్వసించుటకు మనకు సహాయకరముగా నుండు జయము పొందుటకు ప్రోత్సాహక పాఠ్యాంశ క్రమమే మనకు ఈనాడు అవసరమై యున్నది.

దేవుడు మన ద్వారా తన కార్యములను చేయుచున్నాడని మనము నమ్మినప్పుడు, మనము చేయజాలనిది అతి తక్కువ. అతని ద్వారా యేసుక్రీస్తు ఏమేమి చేయగోరుచుండెనో

వాటినన్నిటిని ఆయన చేయగల సమర్థుడై యున్నాడని పౌలు విశ్వసించాడు (ఎఫెసీయులకు 3:20-21; ఫిలిప్పీయులకు 4:13).

### "నేను ఇది చేయగలనని మీరు నమ్ముచున్నారా?" (9:27-31)

మన విశ్వాస పరిమాణము మన ఆలోచనా ధోరణిని నిర్ధారించును, మన ఆలోచనా ధోరణి మన ఆధ్యాత్మిక ఎదుగుదలను నిర్ధారించును. వాడు దేనిని సాధించలేడని నమ్మువాడు, వాడు నమ్ముచున్న స్థాయిని మించి పైకి ఎదుగడు.

దేవుడు ఆలోచించుచున్న విధంగా మనము ఆలోచించమని మనము జ్ఞాపకముంచకొనవలెను (యెషయా 55:8). దేవుని సదుద్దేశములు మరియు ఎదురుచూపుల గూర్చి మనము ముందుగానే ఆలోచించుటకు ప్రయత్నించినప్పుడు ఒక గంభీరమైన పొరపాటు చేయబడును. "దేవుడు నానుండి దీనిని ఆశించుచున్నాడని నేననుకొనను" వంటి ప్రకటనలు మనము ఎన్నడును చేయకూడదు. ఏ పరిస్థితినైనను దేవుడు పరిశీలనగా పరిగణించు విధానంలో మనమెలా పరిగణించగలము? మొదటిగా, మనము మన మనస్సులను నూతనపరచుకొనవలసి యున్నది (రోమీయులకు 12:1, 2). రెండవదిగా, దేవుని మనస్సు ఆయన మనకిచ్చిన తన వాక్యములో (బైబిల్‌లో) బయలుపరచబడినది, గనుక మనము దానిని క్రమము తప్పక అధ్యయనము చేయవలెను.

మనము మన విశ్వాస పరిమాణమును పెంచుకొని, దేవుడు ఆలోచించు తీరులో ఎక్కువగా ఆలోచించుటకు నేర్చుకొను విధానములను మూడు వాక్య భాగములు బయలుపర్చుచున్నవి.

*యేసు నందు విశ్వసించుము* (9:27-31). ఇద్దరు గ్రుడ్డివారు యేసు వెంట వెళ్లారు, ఆయన వారి యందు తన కనికరమును కనుపరచవలెనని ఆయనను బ్రతిమలాడారు. ఆలాగైతే, వారి కోరిక మేరకు ఆయన వారికి చూపు దయచేయగలడని వారు నమ్ముచున్నారో లేదో తెలిసికొనగోరి ఆయన వారిని ప్రశ్నించాడు. అప్పుడు వారు, "ఔను, ప్రభువా, నమ్ముచున్నాము" అని ప్రత్యుత్తరమిచ్చారు (9:28). అప్పుడాయన వారి కన్నులను ముట్టి, "మీ నమ్మిక చొప్పున మీకు కలుగునుగాక" అని పలికాడు (9:29). వెంటనే, వారి కన్నులు తెరువబడినవి, వారు చూడగలిగిరి.

ప్రతి ఒక్కరికి అనుగ్రహింపబడిన ప్రతి స్వస్థత, స్వస్థపరచబడినవాని విశ్వాసముపై ఆధారపడలేదు. ఉదా॥ నలుగురు స్నేహితుల చేత యేసు యొద్దకు మోసికొని తీసుకురాబడిన కుంటివాడు, శతాధిపతి దాసుడు, మరియు గెరాసేనుల దేశములోని దయ్యముపట్టినవాడు.

ఏదిఏమైనా, దేవుని యెడల మనము ఆయన యందుంచు విశ్వాసము యొక్క పరిమాణము చేత నిర్ధారింపబడును. ఆయన సాధించగోరు ఏ కార్యమునైనను మన ద్వారా సాధించుకొనుటకు ఆయన సమర్థుడని మనము విశ్వసించవలెను అప్పుడు సాధించుటకు దేవునికిని మరియు మనకును సాధ్యముకానిది ఏదియును ఉండదు (19:26).

మనము తరుచుగా ఏదో కొంత వాస్తవమైన లేదా ఊహించుకొనబడు అశక్తతనుబట్టి వెనుకంజ వేయుచుందుము. వయస్సు, అనారోగ్యము, మరియు తలాంతుల లేమి మొదలగు మనకు ఆటంకములై యుండును కానీ ఒకడు, వాడు చేయజాలని దాని గూర్చి ఆలోచించుట మానివేసి, వాడు దేవుని శక్తి చేత చేయగల దాని గూర్చి ఆలోచించినప్పుడు,

వాడు "అసమర్థుడై" యుండుట మానివేయును. "ఆధ్యాత్మికముగా అసమర్థులమై యుండుట," శారీరకంగా (శారీరక అంగవైకల్యం చేత) సవాలు చేయబడుట కంటే ఎంతో ఎక్కువ ఘోరమైన పరిస్థితియై యున్నది.

*జయమును గూర్చి దేవుడనుగ్రహించు అభయము చేత ప్రోత్సాహపరచబడుచుందుము* (ఫిలిప్పీయులకు 4:13). మనము సాధించవలెనని దేవుడు ఆశించు సమస్త విషయాలను సాధించగలుగటకు పౌలు మూడు మెట్ల ప్రణాళికను మనముందుంచుచున్నాడు: (1) "నేను చేయగలను," (2) "సమస్తమును," (3) "నన్ను బలపర్చువాని ద్వారానే." దేవుడు అతని ద్వారా ఆయన చేయగోరిన సమస్తమును చేయుటకు ఆయన సమర్థుడై యున్నాడని పౌలు విశ్వసించాడు.

మనము ఆయన రాజ్యములో నెరవేర్చగలవాటిని దేవుడు పరిమితము చేయడు. పరిమితము చేసేది మనమే! "ఏలయనగా, ఒకడు తన ఆంతర్యములో ఆలోచించుకొను దాని ప్రకారము, వెలుపల అయియుండును" (సామెతలు 23:7). మనము దేవుని రాజ్యములో ప్రయోజకులముగా లేమని మనము అందోళన చెందుచున్నట్లయితే, సమస్య దేవునిలో లేదు, కానీ అది మన ఆలోచన ధోరణిలో ఉన్నది.

*మన ద్వారా కార్యములు చేయుచుండు దేవుని శక్తిపై నీ దృష్టిని కేంద్రీకరించుము* (ఎఫెసీయులకు 3:20-21). వాక్య భాగమును మనము జాగ్రత్తగా పరీక్షించి చూద్దాము. "దేవుని" - ఈ విశాల విశ్వమంతటికిని దానిలో నున్న సమస్తమునకును సృష్టికర్తయై యుండి మనలను ఆదుకొనుచున్న దేవుని సూచించుచున్నది. "చేయ శక్తిగల" - చేయుటకు దేవునికి గల శక్తిని ప్రతిబింబించుచున్నది. "అత్యధికముగా" - అనగా, "దాని పరిమాణమును మించి, ఆశించు దాని కంటే, మించి," "మనము అడుగువాటన్నిటి లేక ఊహించువాటన్నిటీ" - దేవుడు దయచేయగల దాని కంటె ఎక్కువ మనము అడుగలేమని సూచించుచున్నది. చేయుటకు దేవునికి గల శక్తిని మించి మనము ఆలోచించజాలము. దేవుని చిత్తము మరియు మన విశ్వాసమే మన పరిమితులై యున్నవి. "మనలో కార్యసాధకమై తన శక్తి చొప్పున" - దేవుడు మన ద్వారా తన శక్తి చొప్పున తన కార్యములను చేయునని సూచించుచున్నది. మనము అల్పముగా ఆలోచించుచు స్వల్పమైన ప్రణాళికలు వేసినట్లయితే, మనము అల్పులముగానే యుందుము. కానీ, ఇందుకు వ్యత్యాసంగా, మనము పెద్దగా ఆలోచించుచు గొప్ప ప్రణాళికలు వేసికొన్నట్లయితే, మనము గొప్ప విషయాలను సాధించగలము. వ్యక్తిగత క్రైస్తవులముగా లేదా ఒక సంఘ సమూహముగా మన ఎదుగుదల మన విశ్వాసమునుబట్టియే ఆటంకపరచబడును లేదా అభివృద్ధినొందును.

*ముగింపు.* మన ద్వారా ఏదైనా చేయవలెనని దేవుడు కోరుచున్నట్లయితే, మనము సిద్ధముగా నుండి దానిని చేయుటకు ఇష్టపడునప్పుడు అది చేయబడగలదు. మనము ఆయనను సేవించుటకు మనలో అంతర్గతముగా దాగియున్న సమర్థతను మన విశ్వాసము నిర్ధారించును.

### సంఘము యొక్క బృహత్కార్యము (9:35-38)

మహా ఆదేశమును (28:18-20; మార్కు 16:15, 16) నెరవేర్చుట సంఘము యొక్క బృహత్కార్యమై యున్నది. ఆ కార్యము "నశించిన దానిని వెదకి రక్షించుటయై"

యున్నది (లూకా 19:10). సంఘముగా మనము చేయు ఇతరమైన సమస్త పనులు ఈ పరిచర్యకు దాసోహం అనుటయే. మనము తరచుగా ఈ వాస్తవము యొక్క దృష్టికోణమును పట్టించుకొనము.

యేసు మనకు మంచి మాదిరియై యున్నాడు (1 పేతురు 2:21). ఆయన "సమస్త పట్టణముల యందును గ్రామముల యందును సంచరించుచు, ప్రతి విధమైన రోగమును ప్రతి విధమైన వ్యాధిని స్వస్థపరచుచునే," "సమాజమందిరములలో బోధించుచు రాజ్య సువార్త కూడ ప్రకటించుచుండెను" (9:35). బోధించుట మరియు ఉపదేశించు ఆయనకు ప్రాథమిక పనులై యుండెను, గనుక సకల విధములైన రోగములను మరియు ప్రతి విధమైన వ్యాధిని నయము చేయుట అప్రధానమైన పనులై యుండును. ఆయన యొక్క అధికారపూర్వక పరిచయమును వ్యవస్థాపించుచు తద్వారా ఆయన ప్రకటించుచుండిన సందేశమును న్యాయసమ్మతమైనదానిగా చేయుట ఈ అద్భుత కార్యముల వెనుక గల ముఖ్యమైన ఉద్దేశమై యుండెను. మనము 'గుర్రాన్ని బండి వెనక పెడితే ప్రయోజనం లేదను' లోక హితోక్తి మాదిరిగా చేయకూడదు. పనులను వాటి ప్రాధాన్యత ప్రకారము చేయవలెను. మనము శరీరమునకు ఆహారము నందించుచు దానిని బాగుచేసుకొన్నట్లే, ఆత్మ గూర్చి కూడ తగు శ్రద్ధ తీసికొనవలెను, ఆత్మను అలక్ష్యము చేయకూడదు.

## ప్రభువు కోత (9:37, 38)

ఈనాడు కూడా యింకా సమృద్ధియైన కోత ఉన్నది కానీ కోయువారు కొద్దిగా ఉన్నారు. "అగణ్యమైనంత మంది ప్రజలు యింక తెలియజెప్పబడకుండానే మిగిలి యున్నారు." యేసు ప్రభువు తన శిష్యులకిచ్చిన మహా ఆదేశము నేటి శిష్యులమైన మనకును వర్తించుచున్నది. "మనము నేలను పరీక్షచేయు తనిఖీదారులము కాదు, కానీ మనము విత్తనములు విత్తుచున్నవారమై యుండవలెను" అని మార్షర్ కీబుల్ చెప్పుచుండెడివాడు. అదే విధంగా, ఉత్పత్తియైన లేక సంపాదింపబడిన ఆత్మ యొక్క నాణ్యతను నిర్ధారించుట కాదు, కానీ దేవునికి చెందవలసిన అదనపు అనుగ్రహ ఆత్మల లాభము దేవునికే చెందునట్లు మనకు చేతనైనంత పోగుచేయుటయే మన బాధ్యతయై యున్నది. తీర్పు దినాన, ఫలించని మరియు ఎవరును సొంతంచేసుకొనని మొక్కలు కూకటివేళ్లతో సహా పెకిలింపబడి అగ్నిలో పారవేయబడును (13:24-30, 36-43; 15:13).

---

సూచనలు

[1]Douglas R. A. Hare, *Matthew,* Interpretation (Louisville: John Knox Press, 1993), 105. [2]Ibid. [3]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 86. [4]Donald A. Hagner, *Matthew 1-13,* Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 248. [5]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 211. [6]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 430. [7]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 65. [8]Josephus *Wars* 3.9.5; Mishnah *Baba Metzia* 6.1. [9]Mishnah *Ke-*

*tuboth* 4.4. [10]Hendriksen, 432–33.

[11]William Barclay, *The Gospel of Matthew,* vol. 1, 2d ed., The Daily Study Bible (Philadelphia: Westminster Press, 1958), 353. [12]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 140. [13]Hare, 106. [14]ఇటువంటి కథయే యెరికో పట్టణములో జరుగుచున్న దాని వివరముల కొరకు మత్తయి 20:29–34; మార్కు 10:46–52; లూకా 18:35–43 చూడు. [15]Hagner, 252. [16]D. A. Carson, *When Jesus Confronts the World: An Exposition of Matthew 8-10* (Grand Rapids, Mich.: Baker Book House, 1987), 100. [17]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 174. [18]Josephus *Life* 45. [19]Hagner, 260.